అధిష్ఠానం ఆమోదంతోనే ఎమ్మెల్యేల చేరికలు

- ఫిరాయింపులపై పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, అక్టోబర్ 23(నమస్తే తెలంగాణ): 'హైకమాండ్‌తో చర్చించిన తర్వాతే ఇతర పార్టీ ఎమ్మెల్యేలను మా పార్టీలో చేర్చుకున్నాం. ఇది సమిష్టి నిర్ణయం' అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టంచేశారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఇతర పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం సమిష్టి నిర్ణయమని తెలిపారు. సీఎం, డిప్యూటీ సీఎం, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, ఏఐసీసీ నాయకత్వంతో సంప్రదింపులు జరిపిన తర్వాతే చేర్చుకున్నట్టు వివరించారు. ఇతర పార్టీ నేతలు రావడంతో పాత కాంగ్రెస్ నేతలు ఇబ్బందులు పడుతున్న మాట నిజమేనని అంగీకరించారు.

ఇప్పుడు రాయితో ఎవరిని కొట్టాలి?

- ఫిరాయింపు ఎమ్మెల్యేలనా? వారిని ప్రోత్సహించినోళ్లనా?
- రేవంత్.. ఇప్పటికైనా లెంపలేసుకుంటవా?
- ఎండగట్టిన మాజీ మంత్రి హరీశ్

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ) : 'కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకే ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుంటున్నమని పీసీసీ అధ్యక్షుడే స్వయంగా అంగీకరించిండు.. ఇప్పుడు రాయితో కొట్టాల్సింది పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలనా? లేక వారిని ప్రోత్సహించినవారినా?' అని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి మాజీ మంత్రి హరీశ్‌రావు నిలదీశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ద్వంద్వ విధానాలు, మోసపూరిత వైఖరి గురించి పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలతో మరోసారి రుజువయ్యాయని బుధవారం ఎక్స్ వేదికగా విమర్శించారు. 'సీఎం రేవంత్‌రెడ్డీ.. మీ సొంత పార్టీ నేతనే, మీరు చేసిన ఎమ్మెల్యేల ఫిరాయింపులు అప్రజాస్వామికమని, ఇది దుర్మార్గమైన చర్య అని వేలెత్తి చూపారు. ఇప్పటికైనా ఈ విషయంలో లెంపలు వేసుకుంటరా?' అని నిలదీశారు. జీవన్‌రెడ్డి లాంటి సీనియర్ నేత కూడా పార్టీ ఫిరాయింపులు అనేవి కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకమని, సీఎం దిగజారుడు రాజకీయాలపై దుమ్మెత్తి పోశారు కదా అని ఉదహరించారు. ఇప్పటికైనా చేసిన తప్పును ఒప్పుకొని, క్షమాపణ చెప్తారా? అని నిలదీశారు. సీఎం గడపగడపకు వెళ్లి చేర్చుకున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై చట్ట ప్రకారం వేటు వేయాల్సిందేనని హరీశ్ డిమాండ్ చేశారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలి

- ప్రస్తుత కాంగ్రెస్ పరిణామాలతో అసంతృప్తి
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

జాబితాపూర్‌లో హత్యకు గురైన గంగారెడ్డి కూతురును ఓదారుస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, అక్టోబర్ 23: పార్టీ ఫిరాయింపులకు కాంగ్రెస్, రాహుల్‌గాంధీ ఎప్పుడూ వ్యతిరేకమేనని, రాష్ట్రంలో ఫిరాయింపు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంపూర్ణ మెజారిటీతో ఉందని, అలాంటప్పుడు ఇతర పార్టీల వాళ్లని చేర్చుకోవడం ఎందుకని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం మూలంగా ఆయా నియోజకవర్గాల్లోని కాంగ్రెసు క్యాడర్‌లో అయోమయం నెలకొందని, దీంతో పదేండ్లు ప్రతిపక్షంలో ఆ పార్టీ నాయకులతో పోరాటం చేసిన వారికి పార్టీ ఫిరాయింపుల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. ఈ నెల 22న దారుణ హత్యకు గురైన జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మారు గంగారెడ్డి కుటుంబ సభ్యులను బుధవారం ఆయన పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను మొదటి నుంచీ పార్టీ ఫిరాయింపులను వ్యతిరేకిస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో తన అనుభవం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నానని, పార్టీ ఫిరాయింపులకు పాల్పడితే సస్పెండ్ చేయాలని చట్టంలో ఉందని పేర్కొన్నారు.

గిరిజనులను దగా చేసిన కాంగ్రెస్

- ఎన్నికల హామీలను విస్మరించిన రేవంత్ సర్కార్
- డిసెంబర్ 22న చలో హైదరాబాద్: ఎల్‌హెచ్‌పీఎస్

ఖైరతాబాద్, అక్టోబర్ 23 : గిరిజనుల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్, ఆ వర్గాలనే దగా చేసిందని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మూడావత్ రాంబాల్ నాయక్ రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గిరిజనులపై కాంగ్రెస్ వివక్షాపూరిత ధోరణిని ఆయన ఖండించారు. రాష్ట్రంలోని 55 నియోజకవర్గాల్లో గిరిజనుల ఓట్లు 60వేలకుపైగా ఉన్నాయని, కాంగ్రెస్ గెలిచిన ప్రతి సీటు లంబాడీలు ఇచ్చిన భిక్షేనని అన్నారు. చివరకు సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడానికి తమ ఓట్లే కీలకమయ్యాయని గుర్తుచేశారు. కేవలం ఓట్ల కోసం లంబాడీలను వాడుకుంటున్నారని, చట్టసభల్లో రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం లేదని వాపోయారు. లంబాడీలు మాట్లాడే భాష గోర్‌బోలిని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 22న చలో హైదరాబాద్ నిర్వహించి, తమ సత్తా చూపిస్తామని స్పష్టంచేశారు. సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శులు గుగులోతు హరినాయక్, భూక్యా కోట్యానాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామావత్ సక్రు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నా జీన్స్‌లోనే కాంగ్రెస్ ఉంది

- నేను కాంగ్రెస్‌లో చేరినా సభ్యత్వం తీసుకోలే
- గంగారెడ్డి హత్య కేసుతో నాకేం సంబంధం లేదు
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, అక్టోబర్ 23 : 'మా జీన్స్‌లోనే కాంగ్రెస్ ఉంది. స్వాతంత్ర్యం రాక ముందు నుంచి మా ఇంట్లో కాంగ్రెస్ పార్టీ ఉంది' అని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పష్టంచేశారు. బుధవారం ఆయన జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేస్తే జగిత్యాల అభివృద్ధి చెందుతుందనే ఆలోచనతో కాంగ్రెస్‌లో చేరినట్టు చెప్పారు. అలాగని కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకోలేదని పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లో జరిగిన గంగారెడ్డి హత్య కేసుతో తనకేం సంబంధం లేదని స్పష్టంచేశారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కావాలనే తన హస్తం ఉన్నదన్నట్టుగా కొందరితో మాట్లాడించడం సరికాదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే హక్కు జీవన్‌రెడ్డికి లేదని అన్నారు.

పథకాలకు ఇంటింటి సర్వేతో లంకె!

- లబ్ధిదారుల ఎంపికకు వినియోగించేలా డాటా సేకరణ
- 55 ప్రశ్నలతో ప్రొఫార్మా
- కుటుంబాల ఆదాయ, వ్యయాల లెక్కల సేకరణ
- మొత్తం 3 దశల్లో సర్వే నిర్వహణకు ప్రణాళిక

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న సమగ్ర ఇంటింటి సర్వే డాటా ఆధారంగానే వివిధ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నది. తదనుగుణంగా సర్వే ప్రశ్నావళిని రూపొందించిందని, దీంతో ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో ఇంటింటి సర్వే డాటాయే కీలకంగా మారనున్నదని అధికార వర్గాలు చెప్తున్నాయి. ఈ నెలాఖరు నుంచే ఈ సర్వేను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రణాళికా విభాగం.. డాటా కలెక్షన్‌కు ఎన్యుమరేటర్లను ఎంపిక చేయడం, శిక్షణకు సంబంధించిన షెడ్యూల్‌ను రూపొందించడంలో నిమగ్నమైంది.

55 ప్రశ్నలతో ప్రొఫార్మా

ఇంటింటి సర్వేకి సంబంధించిన ప్రశ్నావళిని ప్రణాళికా విభాగం ఇప్పటికే రూపొందించింది. మొత్తం 55 ప్రశ్నలతో ప్రొఫార్మాను సిద్ధం చేసింది. కుటుంబ పెద్ద, సభ్యుల వివరాలతోపాటు వారి ఇండ్లు, స్థలాలు, వాహనాలు, వృత్తి, పశువులు, స్థిరచరాస్తులు, తాగునీటి కనెక్షన్లు, వంటగ్యాస్, ఇంటి కోసం తీసుకున్న రుణాలు తదితర వివరాలన్నింటినీ సేకరించేలా ఈ ప్రశ్నలను రూపొందించింది. రాష్ట్రంలోని మొత్తం 1.20 కోట్ల కుటుంబాల డాటా సేకరణకు 90 వేల మంది ఎన్యుమరేటర్లు, సర్వే ప్రక్రియ పర్యవేక్షణకు 12,500 మంది సూపర్‌వైజర్లు అవసరమవుతారని ప్లానింగ్ బోర్డు ఇప్పటికే అంచనా వేయడంతో పాటు వారి నియామకాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపింది.

3 దశల్లో డాటా సేకరణ

మూడు దశల్లో ఇంటింటి సర్వే నిర్వహించేందుకు సిద్ధమవుతున్న ప్లానింగ్ బోర్డు.. ఫస్ట్, సెకండ్ ఫేజ్‌లకు 3 వారాల చొప్పున సమయాన్ని కేటాయించేందుకు, థర్డ్ ఫేజ్‌లో డాటాను ప్రాసెస్ చేసి సదరు నివేదికను ప్రభుత్వానికి అందజేసేందుకు ప్రణాళికను రూపొందించింది. ఫస్ట్ ఫేజ్‌కు కేటాయించే 3 వారాల్లో ఒక వారం సర్వే అవసరాలకు ఉద్దేశించిన హౌజ్ లిస్టింగ్, స్టీరింగ్ కమిటీ నియామకం, ప్రశ్నావళి పరిశీలన, మాన్యువల్ తయారీ, జిల్లా కలెక్టర్లతో సమావేశాలు, ఎన్యుమరేషన్ బ్లాక్‌ల ఏర్పాటు, మాస్టర్ ట్రెయినర్లతోపాటు ఎన్యుమరేటర్లకు, సూపర్ వైజర్లకు శిక్షణ, డిజిటల్ యాప్ తయారీ, ప్రయోగాత్మక వినియోగం తదితరాలు ఉంటాయి. మిగిలిన రెండు వారాల్లో సర్వే సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రజల వివరాలను సేకరిస్తారు. మొదటి వారంలో జరిగే ప్రక్రియ కోసం ప్రతి నలుగురు ఎన్యుమరేటర్లకు ఒకరు చొప్పున, ఆ తర్వాతి రెండు వారాల్లో ప్రతి 8 మంది ఎన్యుమరేటర్లకు ఒకరు చొప్పున సూపర్‌వైజర్లను నియమించనున్నారు. ఒక్కో ఎన్యుమరేటర్ రోజుకు 80 కుటుంబాల చొప్పున 2 వారాలపాటు డాటా సేకరించేలా ప్రణాళికను సిద్ధం చేశారు. ఫస్ట్ ఫేజ్‌లోని మూడు వారాల పనులు సమాంతరంగా జరిగేలా మార్గదర్శకాలను సిద్ధం చేశారు. 2వ ఫేజ్‌లోని మూడు వారాల వ్యవధిలో ప్రజల నుంచి సేకరించిన డాటాను పరిశీలించి క్రాస్ చెక్ చేసుకోవాల్సి ఉంటుంది. డాటా సేకరణలో ఎలాంటి తప్పులు, లోపాలు, పొరపాట్లకు ఆస్కారం లేకుండా మొత్తం 55 ప్రశ్నలను క్రాస్ చెక్ చేస్తారు. ఇందుకోసం ఈ ఫేజ్‌లోని మొదటి రెండు వారాలను కేటాయించుకుని, చివరి (మూడవ) వారాన్ని మిస్ అయిన ఇండ్ల నుంచి వివరాలను సేకరించడం, వారి నుంచి తీసుకున్న అంశాలను ప్రింటవుట్ తీసి వారికి అందజేయడం, మరో కాపీ మీద వారి నుంచి సంతకాలు తీసుకుని ఫైలింగ్ చేయడం తదితరాలకు వినియోగించనున్నారు. ఎన్యుమరేటర్లు సేకరించిన వివరాలను సూపర్ వైజర్లు కూడా పర్యవేక్షించనున్నారు. అలా సేకరించిన డాటాను 3వ ఫేజ్‌లో కంప్యూటరీకరణ చేయనున్నారు. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, డిజిటల్ యాప్‌లలో అప్‌లోడ్ చేసి గ్రామాలవారీగా డాటా బేస్ సిద్ధం చేయనున్నారు. ఆ రెండు వారాల వ్యవధిలోనే మొత్తం కులాలు, కుటుంబాలు, ఆర్థిక అంశాలు, వాటన్నింటితో కూడిన నివేదికను ప్రణాళికా విభాగం సిద్ధం చేయనున్నది. మొత్తంగా డిసెంబరు 9లోగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలన్నది లక్ష్యం.

డాటా ఆధారంగానే 6 గ్యారెంటీలు

ఇంటింటి సర్వేలో సేకరించే వివరాలను రాబోయే రోజుల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో లబ్ధిదారుల అర్హతను నిర్ధారించడానికి వినియోగించే అవకాశమున్నదని అధికార వర్గాలు చెప్తున్నాయి. ఈ సర్వేలో ప్రతి వ్యక్తి కులం, ఉపకులం, మతం, ఆధార్ నంబర్, ఓటరు గుర్తింపుకార్డు నంబర్, అంగవైకల్య ధ్రువీకరణ, కుటుంబసభ్యుల సంప్రదాయ వృత్తి, ఉపాధి, నెలవారీ జీతం, ప్రభుత్వ/ప్రైవేట్ ఉద్యోగం, వృత్తితో వస్తున్న వ్యాధులు, కూలీలు/కార్మికులైతే వారి రోజువారీ వేతనం, వార్షిక ఆదాయం, ఆదాయ పన్ను చెల్లింపు, బ్యాంకు ఖాతా నంబర్, కుటుంబానికున్న సాగుభూమి విస్తీర్ణం, పట్టాదారు పాస్‌బుక్ నంబర్, ప్రస్తుతం వంట గ్యాస్ సిలిండర్ వాడుతున్నారా? లేదా? ఎలాంటి ఇంటిలో నివసిస్తున్నారు? టాయిలెట్ సౌకర్యం, తాగునీటి కనెక్షన్ ఉన్నాయా? లేవా?, వాడుతున్న వాహనాలు, ఇప్పటివరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన రాజకీయ అవకాశాలు తదితర వివరాలను సేకరించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన 6 గ్యారెంటీల అమలుతోపాటు ఇతర అన్ని పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఈ డాటానే ప్రామాణికంగా తీసుకోనున్నట్టు అధికార వర్గాలు చెప్తున్నాయి.

ఆర్టీసీకి దసరా ఆదాయం 307 కోట్లు

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): దసరా, సద్దుల బతుకమ్మ పండుగలు టీజీఎస్‌ఆర్టీసీకి కలిసొచ్చింది. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో భారీ సంఖ్యలో ప్రయాణాలు సాగాయి. ఈ నెల 1 నుంచి 15 వరకు ఆర్టీసీ బస్సుల్లో సుమారు 707.73 లక్షల మంది ప్రయాణించగా, రూ.307.16 లక్షల ఆదాయం సమకూరినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రయాణికుల రద్దీ మేరకు 10,512 అదనపు బస్సులను నడిపినట్టు పేర్కొన్నారు. ఈ నెల 9,10,11 తేదీల్లో ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో ప్రయాణించినట్టు తెలిపారు.

20 రోజుల్లో కొన్నది 1,440 టన్నులే!

- ధాన్యం కొనుగోళ్లపై మంత్రి ఉత్తమ్ లెక్కల వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): వానకాలం సీజన్‌లో 230 మంది రైతుల నుంచి రూ.3.34 కోట్ల విలువైన 1,449 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మొత్తం 7,248 కొనుగోలు కేంద్రాలకు గాను 2,539 కేంద్రాలు ప్రారంభించినట్టు చెప్పారు. బుధవారం ధాన్యం కొనుగోళ్లపై ఉమ్మడి నిజామాబాద్ ప్రజాప్రతినిధులతో హైదరాబాద్‌లోని సివిల్‌సప్లై భవన్‌లో ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు వివరాలు వెల్లడించారు. "ధాన్యంపై క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక సిద్ధమైంది. గురువారం జరగనున్న క్యాబినెట్ సమావేశంలో చర్చించి, కీలక నిర్ణయాలు తీసుకుంటాం. ఈ సీజన్‌లో 60.73 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా 146.70 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుంది. ఇందులో సుమారు 80 లక్షల టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో 30 లక్షల టన్నులు దొడ్డు రకం కాగా 50 లక్షలు టన్నుల సన్నాలే" అని మంత్రి తెలిపారు.

ఎన్నికలప్పుడు మీతో ఆందోళనలు చేయించాం

- 26న సీఎస్ సమక్షంలో న్యాయం జరిగేలా చూస్తాం
- తనను ఘెరావ్ చేసిన జీవో 46 బాధితులతో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): 'మీరు మా పార్టీ కోసం సహకరించారు. ఎన్నికలప్పుడు మేమే మీతో దీక్షలు, ధర్నాలు చేయించాం. వాటికి పర్మిషన్లు కూడా మేమే ఇప్పించాం. ఈ నెల 26న మీ ప్రతినిధులను సీఎస్ దగ్గరకు తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తాం' అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డీ శ్రీధర్‌బాబు జీవో 46 బాధితులకు హామీ ఇచ్చారు. మంత్రి బుధవారం గాంధీభవన్‌కు వస్తున్నారన్న సమాచారంతో వందలాది మంది జీవో 46 బాధితులు గాంధీభవన్ ముట్టడికి తరలివచ్చారు. ముందుగా మంత్రి రాగానే ఘెరావ్ చేశారు. ఎన్నికల సమయంలో తమతో దగ్గరుండి ఆందోళనలు చేయించిన కాంగ్రెస్.. ఇప్పుడెందుకు ముఖం చాటేస్తుందని నిలదీశారు. తమకు జరిగిన అన్యాయాన్ని మంత్రికి వివరించారు. కావాలనే కొందరు కాంగ్రెస్ నేతలు తమ వాదనలు కోర్టులో నిలువకుండా అడ్డుకున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు బాధితులకు భరోసా కల్పించారు. మంత్రి హామీతో ప్రస్తుతానికి ఆందోళన విరమిస్తున్నామని జీవో 46 బాధితులు మీడియాకు చెప్పారు.

అటవీ సిబ్బందికి అవార్డులివ్వాలి

కేంద్రానికి మంత్రి కొండా సురేఖ లేఖ

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): అటవీశాఖ సిబ్బందికి ప్రతి ఏడాది ప్రెసిడెన్షియల్ గ్యాలంటరీ అవార్డులను ప్రదానం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ కోరారు. కేంద్ర పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌కి బుధవారం లేఖ రాశారు. అటవీ అధికారుల నిరుపమానమైన సేవలను గుర్తిస్తూ వారికి అవార్డులు ప్రదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రస్థాయిలో అటవీ సేవా, వన సంరక్షణ సేవా పతకాలు, చీఫ్ మినిస్టర్ అవార్డు, జాతీయస్థాయిలో ప్రెసిడెన్షియల్ గ్యాలంటరీ అవార్డు, ఇందిర ప్రియదర్శిని వృక్షమిత్ర అవార్డు, ఇతర జాతీయ అవార్డులను అందించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.

వయనాడ్‌కు నిరుద్యోగులు

- ప్రియాంక ఓటమే ధ్యేయంగా ప్రచారానికి నిర్ణయం
- వాడుకొని వదిలేసిన కాంగ్రెస్‌పై రగులుతున్న యువత
- అన్యాయానికి ప్రతీకారం తీర్చుకునేందుకు రెడీ
- నమ్మక ద్రోహాన్ని ప్రజలకు వివరిస్తామని వెల్లడి
- మహారాష్ట్ర, జార్ఖండ్‌లో త్వరలో బస్సుయాత్ర

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల్లో తమను ఉసిగొల్పి తీరా గద్దెనెక్కాక వదిలేసి మోసం చేసిన కాంగ్రెస్‌పై నిరుద్యోగులు రగిలిపోతున్నారు. తమకు జరిగిన అవమానం, అన్యాయానికి ప్రతీకారం తీర్చుకునేందుకు రెడీ అయ్యారు. కాంగ్రెస్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్పి తమ పవరేంటో చూపించాలని నిరుద్యోగ జేఏసీ నేతలు నిర్ణయించారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ పోటీచేస్తున్న వయనాడ్‌లో ఆమెకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని జేఏసీ నేతలు ప్రకటించారు. గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు పూర్తికాగానే నిరుద్యోగ జేఏసీ ప్రతినిధుల బృందం వయనాడ్ వెళ్లి ప్రియాంక ఓటమే ధ్యేయంగా ప్రచారం చేస్తుందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లో త్వరలోనే బస్సుయాత్ర నిర్వహిస్తామని, ఈ రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ మోసాలను ఎండగట్టి, తమలా అక్కడివారు మోసపోవద్దని వివరిస్తామని జేఏసీ నేతలు తెలిపారు. తెలంగాణలోనూ స్థానిక సంస్థల ఎన్నికల ముందు బస్సుయాత్ర చేపడుతామని చెప్పారు. కాంగ్రెస్ మోసాలపై కరపత్రం ముద్రించి ప్రచారం చేస్తామన్నారు. నిరుద్యోగులను కాంగ్రెస్ నమ్మించి గొంతుకోసిందని, ఇదే విషయాన్ని ఓటర్లకు వివరిస్తామని తేల్చిచెప్పారు. ఇప్పటికే కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్ ఆ పార్టీకి వ్యతిరేకంగా మహారాష్ట్ర బస్సుల్లో ప్రచారం చేస్తున్నారు. నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని పోస్టర్లు ముద్రించి, ప్రచారాన్ని ప్రారంభించారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్తాం

నిరుద్యోగుల పాలిట కాంగ్రెస్ శాపంగా మారింది. గ్రూప్ -1లో జీవో 29ని తెచ్చి రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తూ తీరని అన్యాయం చేస్తున్నది. మేం కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా మమ్మల్ని సముదాయించే ప్రయత్నం చేశారు. గ్రూప్ -1 ప్రిలిమ్స్ ఫైనల్ కీ ఖరారు విషయంలో తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రామాణికం కాదని, వికీపీడియా, గూగుల్ ప్రమాణికమని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం తన అవివేకాన్ని చాటుకున్నది. మ్యానిఫెస్టోలో 30 అంశాలుపెట్టి, 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని నమ్మబలికి మోసం చేసింది. మొండిగా వ్యవహరించిన కాంగ్రెస్‌కు మేమంతా గట్టి గుణపాఠం చెప్పాలని నిర్ణయించుకున్నాం. నిరుద్యోగులమంతా వయనాడ్‌లో గడపగడపకు తిరిగి, ప్రియాంకగాంధీని ఓడించేందుకు ప్రచారం చేస్తాం. మహారాష్ట్ర, జార్ఖండ్‌లో కాంగ్రెస్ ఉనికి లేకుండా చేస్తాం.

- రమావత్ ఇంద్రకుమార్‌నాయక్

కాంగ్రెస్ ఓటమే లక్ష్యం

కాంగ్రెస్ వస్తే మా బతుకులు మారుతాయనుకున్నం. అత్యంత వేగంగా తప్పుల్లేకుండా నోటిఫికేషన్లు ఇస్తారనుకున్నం. కానీ కాంగ్రెస్ సర్కారు మొండిగా వ్యవహరిస్తూ తప్పుల మీద తప్పులు చేస్తున్నది. తప్పులు చేసినా అడగొద్దు.. ప్రశ్నించొద్దు అన్నట్టు నిరంకుశంగా వ్యవహరిస్తున్నది. పైగా మేమే నోటిఫికేషన్లను అడ్డుకుంటున్నట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నది. నిరుద్యోగుల జీవితాలతో దుర్మార్గంగా ఆడుకుంటున్నది. నిరుద్యోగులపై లాఠీలను ప్రయోగించి రక్తాన్ని కండ్ల చూసింది. ఇలాంటి కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పేందుకు మేం ప్రియాంక గాంధీ పోటీచేస్తున్న వయనాడ్‌కు బయలుదేరబోతున్నం. మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమే లక్ష్యంగా బస్సుయాత్ర నిర్వహించి ప్రచారం చేస్తం.

- జనార్దన్ అనుములపురి

సస్పెన్షన్లపై రగిలిన ఏఈవోలు

- వ్యవసాయ శాఖ డైరెక్టరేట్ వద్ద భారీ ధర్నా
- బెదిరింపులకు దిగిన బడా సంఘం నేతలు
- ఏఈవోలతో డైరెక్టర్ గోపి చర్చలు సఫలం
- నేటి నుంచి డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహణకు ఏఈవోల అంగీకారం

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): డిజిటల్ క్రాప్ సర్వే చేయలేదన్న కోపంతో రాష్ట్ర ప్రభుత్వం 165 మంది వ్యవసాయ విస్తరణాధికారులను సస్పెండ్ చేయడంపై ఏఈవోలు రగిలిపోయారు. వ్యవసాయ శాఖతో తాడోపేడో తేల్చుకునేందుకు బుధవారం భారీ సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివచ్చారు. జిల్లాల నుంచి వందల సంఖ్యలో వచ్చిన ఏఈవోలు బషీర్‌బాగ్‌లోని వ్యవసాయ శాఖ డైరెక్టరేట్‌లో ధర్నాకు దిగారు. సర్వేలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలని, సస్పెండ్ చేసిన ఏఈవోలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారిని అడ్డుకునేందుకు ప్రభుత్వం ఓ బడా సంఘం నేతలను రంగంలోకి దించింది. ఆ నేతలు ఏఈవోలను బెదిరించినట్టు తెలిసింది. 'ఈ ధర్నా చేసే హక్కు మీకు ఎవరిచ్చారు? అసలు మీ సంఘం ఎక్కడున్నది? రిజిస్ట్రేషన్ చూపించండి' అంటూ విరుచుకుపడినట్టు సమాచారం.

ఏఈవోలతో డైరెక్టర్ చర్చలు సఫలం

165 మంది ఏఈవోల సస్పెన్షన్ రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడం, మిగిలిన ఏఈవోలు మూకుమ్మడి సెలవులో వెళ్లేందుకు నిర్ణయించడంతో వ్యవసాయ శాఖ అప్రమత్తమైంది. అందులో భాగంగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి బుధవారం ఉదయం ఏఈవోలను చర్చలకు పిలిచారు. ముందు సర్వే ప్రారంభించాలని, సర్వే చేయడంలో ఎదురయ్యే సమస్యలను వచ్చే వారం పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఏఈవోలపై సస్పెన్షన్‌ను కూడా ఎత్తివేస్తామని తెలిపారు. దీంతో సర్వే నిర్వహణకు ఏఈవో సంఘం నేతలు అంగీకరించారు. డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని గురువారం నుంచి సర్వే చేస్తామని తెలిపారు. వారం రోజుల్లో తమ సమస్యను పరిష్కరిస్తామని వ్యవసాయ శాఖ డైరెక్టర్ స్పష్టమైన హామీ ఇవ్వడంతో నిరసనను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు ఏఈవో సంఘం నేత సుమన్ వెల్లడించారు.

ఏఈవోలపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ) : మహారాష్ట్ర, ఒడిశా, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో ప్రైవేటు కంపెనీలు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ద్వారా డిజిటల్ సర్వే చేయిస్తుంటే.. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఏఈవోలతో డిజిటల్ సర్వే చేయిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. డిజిటల్ సర్వే పేరుతో వారిపై అదనపు భారాన్ని మోపుతూ, వేధింపులకు గురి చేయడం దుర్మార్గమైన చర్య అని బుధవారం ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. దేశానికే అన్నపూర్ణగా ఎదిగిన తెలంగాణ విజయగాథలో ఏఈవోల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. ఏఈవోలపై కాంగ్రెస్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తూ సస్పెండ్ చేయడమేనా ప్రజాపాలన అంటే.. అని నిలదీశారు. సస్పెండ్ చేసిన 163 మంది ఏఈవోలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, డిజిటల్ సర్వే ఏఈవోలకు భారం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

ప్రియాంక నామినేషన్‌కు తెలంగాణ హెలికాప్టర్?

- వయనాడ్‌లో చక్కర్ల ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్

రాహుల్‌గాంధీ వినియోగించిన హెలికాప్టర్

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వానికి చెందిన హెలికాప్టర్‌ను కాంగ్రెస్ పార్టీ ఇంటి వాహనంగా వాడుకుంటున్నదా? బుధవారం కేరళలోని వయనాడ్‌లో ప్రియాంక గాంధీ నామినేషన్ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ హెలికాప్టర్‌ను వాడుకున్నారా? ఇవే సందేహాలు వ్యక్తంచేస్తూ బుధవారం సోషల్‌మీడియాలో పలు పోస్టులు ప్రత్యక్షమయ్యాయి. బుధవారం ప్రియాంకాగాంధీ వయనాడ్ నుంచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమం కోసం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, నేతలు రాహుల్, కేసీ వేణుగోపాల్ తదితరులు హెలికాప్టర్‌లో వయనాడ్ చేరుకున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు బయటకు రావడంతో కాంగ్రెస్ నేతలు వినియోగించిన హెలికాప్టర్.. తెలంగాణ ప్రభుత్వ హెలికాప్టరేనంటూ ప్రచారం మొదలైంది. తెలంగాణ సీఎం, మంత్రులు, ఉన్నతాధికారులు వినియోగించాల్సిన హెలికాప్టర్‌ను కాంగ్రెస్ అగ్ర నేతల కోసం వాడుతారంటూ నెటిజన్ల నుంచి విమర్శలు కూడా వెల్లువెత్తాయి. ఇటీవల ఖమ్మం వరదలప్పుడు ప్రజలను ఆదుకోవడానికి రాని హెలికాప్టర్.. కాంగ్రెస్ నాయకుల చక్కర్లకు మాత్రం ఇలా ఉపయోగపడుతుందని అనుకోలేదంటూ నెటిజన్ ఒకరు వ్యంగ్యంగా ఎత్తిపొడిచారు. ఇటీవలికాలంలో హెలికాప్టర్ పర్యటనలపై కాంగ్రెస్ ప్రభుత్వంలో రచ్చ జరుగుతున్నది. తనకు అవసరమైనప్పుడు హెలికాప్టర్ ఇవ్వలేదని ఓ మంత్రి ముఖ్యమంత్రి రేవంత్‌పైనే ఆగ్రహం వ్యక్తంచేసినట్టు వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో వయనాడ్‌లో ప్రభుత్వ హెలికాప్టర్ కాంగ్రెస్ నేతలతో చక్కర్లు కొడుతున్నదంటూ వార్త వెలువడటం గమనార్హం.

నాలుగోసారి రేవంత్‌రెడ్డి కేరళ పర్యటన

సీఎం రేవంత్‌రెడ్డి కేరళ పర్యటన ముగిసింది. మంగళవారం సాయంత్రం బయల్దేరి వెళ్లిన ఆయన బుధవారం రాత్రి తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటినుంచి రేవంత్ ఇప్పటివరకు నాలుగుసార్లు కేరళలో పర్యటించారు. ఢిల్లీ తర్వాత అత్యధికసార్లు ఆయన కేరళలోనే పర్యటించారని తెలుస్తున్నది.

ఆయిల్ పామ్ సాగుకు సహకరించండి

- మలేషియా పర్యటనలో మంత్రి తుమ్మల విజ్ఞప్తులు

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు సహకారం అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మలేషియా ప్రభుత్వాన్ని కోరారు. మలేషియా పర్యటనలో భాగంగా బుధవారం ఆ దేశ మంత్రి జోహరి అబ్దుల్ ఘనీతో, పామాయిల్ బోర్డు చైర్మన్ అహ్మద్ పర్వేజ్ గులామ్ ఖాదీర్‌తో భేటీ అయ్యారు. తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సహకాలు అందిస్తున్నదని చెప్పారు. మాట్రోయ్ చైర్మన్ డాటో సెరి రీజల్ మెరికన్‌తోనూ తుమ్మల భేటీ అయ్యారు. మలేషియాతో వ్యవసాయపరంగా వ్యాపార సంబంధాలపై చర్చించారు. ఈ సందర్భంగా సెరి రీజల్ మాట్లాడుతూ.. తమ దేశంలో నూకలకు అత్యంత డిమాండ్ ఉందని, తెలంగాణ నుంచి సరఫరా చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు.

టార్గెట్..జీపీ లేఔట్లు

› మొదటిపేజీ తరువాయి...

ఉన్నాయి. ఇక మేడ్చల్ జిల్లాలో మరో 100, సంగారెడ్డి జిల్లాలో వందకు పైగా జీపీ అనుమతులతో వేసిన లేఅవుట్లను నిషేధించినట్టు తెలిసింది. ఈ జాబితాను హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో పొందుపరిచి.. ఇప్పుడు ఆ వెబ్‌సైట్ లింకులను తొలగించేశారు. ఒక్కో లేఅవుట్‌లో 20 నుంచి 50 ప్లాట్ల వరకు ఉండటంతో అటు డెవలపర్లు, కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు.

హెచ్‌ఎండీఏలో స్పందన కరువు

నిషేధించిన జీపీ లేఅవుట్ల జాబితా ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో కొందరు కొనుగోలుదారులు హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయానికి క్యూ కడుతున్నారు. కానీ హెచ్‌ఎండీఏ ప్లానింగ్ అధికారులు ఈ విషయంపై మాట్లాడేందుకు నిరాకరిస్తున్నారు. హెచ్‌ఎండీఏ కంటే ముందున్న హుడా సమయంలోనే వెలిసిన జీపీ లేఅవుట్లు కూడా నిషేధిత జాబితాలో చేరాయి. అన్ని అనుమతులు, నిబంధనలకు అనుగుణంగా డెవలప్ చేసిన లేఅవుట్లను నిషేధిత జాబితాలో చేర్చడం వెనుక కాంగ్రెస్ కుట్రలు ఉన్నాయని రియల్ ఎస్టేట్ నిపుణులు భావిస్తున్నారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేసి, జీపీ లేఅవుట్లలో ఒక్కసారి కూడా రిజిస్ట్రేషన్ కానీ ప్లాట్ల క్రయవిక్రయాలకు అనుమతించాలని, నిషేధిత జాబితా పేరిట పేద, మధ్యతరగతి వర్గాలను భయభ్రాంతులకు గురి చేయవద్దని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నారగోని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.